
www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 10 అక్టోబర్ 2025

5

ఏలూరు



ఉద్యమ స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో జిల్లా యంత్రాంగం ఉద్యమ స్థాయిలో పెద్దఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించింది. కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, షెడ్యూల్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ శాఖలకు చెందిన పాఠశాలలు, వసతి గృహాల్లో బ్లీచింగ్ చల్లడం, పారిశుద్ధ్య కార్యక్రమాలు, దోమలు వ్యాపించకుండా ఫాగింగ్, తాగునీటి నీటి ట్యాంకులను శుభ్రపరిచే పనులు, ఫీవర్ సర్వే, వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి విద్యార్థులకు వైద్య పరీక్షలను రెండు రోజుల్లో ఉద్యమ స్థాయిలో చేపట్టారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచి, క్లోరినేషన్ చేశారు. తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.



బస్సు ఆగదు.. ప్రయాణం సాగదు..!

- ఉచిత బస్సు ప్రయాణంతో పెరిగిన ప్రయాణికుల సంఖ్య
- 65 నుంచి 78 శాతం పెరిగిన ఆక్యూపెన్సీ రేషియో
- ఓఆర్‌కు అనుగుణంగా పెరగని బస్సుల సంఖ్య
- ప్రయాణికులు చెయ్యెత్తినా ఆగని ఆర్‌టిసి బస్సులు
- రెండు జిల్లాల్లో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం
- ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం అందుకు తగిన విధంగా బస్సులను ఏర్పాటు చేయడంలో విఫలమైంది. ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగినా అందుకు తగినన్ని ఆర్‌టిసి బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రయాణికులు చెయ్యెత్తినా బస్సులు ఆగకుండా వెళ్లిపోతున్న పరిస్థితి ఉంది. దీంతో ప్రయాణం ముందుకు సాగక జనం నలిగిపోతున్నారు. ఉచిత బస్సు పథకంతో లక్షలాది మంది లబ్ధి పొందారంటూ లెక్కలతో సరిపెడుతున్నారే తప్ప.. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందుల గురించి మాత్రం ప్రభుత్వం, ఆర్‌టిసి అధికారులు మాట్లాడటం లేదు. దీంతో ప్రభుత్వంపై ప్రయాణికుల్లో తీవ్ర అసహనం పెరుగుతోంది. ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి తేవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఉచిత బస్సు ప్రయాణంతో ఓఆర్ (ఆక్యుపెన్సీ రేషియో) భారీగా పెరిగింది. అందుకు తగిన విధంగా ప్రభుత్వం బస్సుల సంఖ్య మాత్రం పెంచడం లేదు. దీంతో జనానికి ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం అందని ద్రాక్షగా మారింది. ఏలూరు జిల్లాలో మొత్తం 309 బస్సులు ఉండగా ఉచిత బస్సు ప్రయాణానికి 177 బస్సులను కేటాయించారు. ఆగస్టు 15 నుంచి ఇప్పటి వరకూ ఉచిత బస్సుల్లో 31.28 లక్షల మంది మహిళలు ప్రయాణించారు. ఉచిత బస్సు ప్రయాణం రాకముందు ఏలూరు జిల్లాలో ఓఆర్ 65 శాతం వరకూ ఉండగా ఇప్పుడు 78 శాతానికి పెరి గింది. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 298 బస్సులు ఉండగా ఉచిత బస్సు కింద 213 బస్సులను కేటాయించారు. ఇప్పటి వరకూ ఉచిత బస్సు ప్రయాణం కింద 44.74 లక్షల మంది మహిళలు ప్రయాణాలు సాగించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఆగ స్టు 15కు ముందు ఓఆర్ 66 శాతం ఉండగా ఇప్పుడు 75 శాతానికి చేరింది. ప్రయాణికుల ఆక్యూపెన్సీ రేటు ఏలూరు జిల్లాలో 13 శాతం, పశ్చిమలో తొమ్మిది శాతం వరకూ పెరిగింది. ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిన అందుకు తగిన విధంగా బస్సులు ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. దీంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి.

చెయ్యెత్తినా ఆగని ఆర్‌టిసి బస్సులు

ప్రయాణికులు చెయ్యెత్తిన చోట ఆర్‌టిసి బస్సులు ఆగుతాయనే నినాదాన్ని పూర్తిగా తుంగలో తొక్కేసిన పరిస్థితి నెలకొంది. పట్టణాల్లోని బస్టాండ్లలో తప్ప మధ్యలో గ్రామాల్లోని బస్టాప్‌ల్లో ఆర్‌టిసి బస్సులు ఆగడం లేదు. ప్రయాణికులు చెయ్యెత్తినా బస్సు ఖాళీ లేదంటూ వెళ్లిపోతున్న పరిస్థితి ఉంది. దీంతో ప్రయాణికులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఎంతోమంది మహిళలు సైతం ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఏలూరు నుంచి రావులపాలెం వెళ్లే బస్సులు ఆశ్రం వద్ద కూడా ఆగడం లేదు. తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వచ్చే బస్సులు వంతెనపైన ఏలూరు వెళ్లే రోడ్డులో ఆగని పరిస్థితి ఉంది. ఒకవేళ అతికష్టంపై బస్సు ఎక్కినా గమ్యస్థానం వరకూ నిలబడే ప్రయాణం చేయాల్సి వస్తోంది. వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమయానికి బస్సులు రాకపోవడంతో గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. భీమవరం నుంచి తాడేపల్లిగూడెం రావాలంటే ప్రయాణికుల అవస్థలు చెప్పుకోనవసరం లేదు. ఉచిత బస్సు పథకం పెట్టిన ప్రభుత్వం అందుకు తగిన బస్సుల సంఖ్యను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికుల్లో తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉచిత బస్సుతో ప్రభుత్వానికి అనుకున్నంత లబ్ధి రాకపోగా, వ్యతిరేకత పెరుగుతున్న పరిస్థితి ఉంది. ఇప్పట్లో కొత్త బస్సులు వచ్చే అవకాశం లేదని జిల్లాలోని ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వం అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చెప్పొచ్చు.

జెసిగా అభిషేక్ గౌడ

అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎంజె.అభిషేక్‌గౌడను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్నారు. ఐఎఎస్‌ల బదిలీల్లో భాగంగా ఆయన జిల్లాకు రానున్నారు. అభిషేక్‌గౌడ 2020 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి. ఈయన కర్నాటకవాసి. గత సెప్టెంబర్ 15న ఇక్కడ జెసిగా పని చేస్తున్న ధాత్రిరెడ్డిని ప్రభుత్వం బదిలీ చేసింది. అప్పటి నుంచి జెసి పోస్టు ఖాళీగానే ఉంది. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు దగ్గర పడటంతో పౌరసరఫరాల శాఖను పర్యవేక్షించే జెసిని నియమించకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఇటీవల 'ప్రజాశక్తి'లో 'ధాన్యంకు వేళాయే.. జెసి లేరాయే' అంటూ కథనం ప్రచురితమైంది. జెసిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం రైతులకు మేలు చేసే అంశంగా చెప్పొచ్చు. జిల్లా జాయింట్ కలెక్టర్‌గా అభిషేక్ గౌడ ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

మళ్లీ పెరిగిన పెరిగిన గోదావరి వరద

పోలవరం స్పిల్ వే నుంచి 4,9,379 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

అల్పపీడన ప్రభావంతో ఎగువ రాష్ట్రాల్లో, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉప నదులు, జలాలు గోదావరిలో కలిసి గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. ఐదు రోజులుగా శాంతించిన గోదావరి గురువారం సాయం త్రానికి మళ్లీ పెరిగింది. పోలవరం నుంచి 4,93,379 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 30.050 మీటర్లు, దిగువన 20.750 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 31.61 అడుగులకు పెరిగింది. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 9.05 మీటర్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

యువతకు రోల్ మోడల్ విప్లవ కెరటం చే

వర్థంతి కార్యక్రమంలో వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్



నివాళులర్పిస్తున్న నేతలు

యువతకు రోల్ మోడల్ విప్లవ కెరటం చేగువేర అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి అన్నారు. గురువారం చేగువేరా 58వ వర్థంతి సందర్భంగా సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో చేగువేర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అన్యాయాలకు, దోపిడీలకు సరిహద్దులు లేవని,అలానే వాటి అంతం కోసం పోరాడే విప్లవకారులకు సరిహద్దులు ఉండకూడదని చాటిన గొప్ప విప్లవకారుడు చేగువేరా అని కొనియాడారు. వ్యక్తికి పట్టిన వైరస్‌ను చంపడం కన్నా సమాజానికి పట్టిన వైరస్‌ను చంపడం మిన్న అని భావించి తన డాక్టర్ వృత్తిని వదిలి విప్లవోద్యమంలో చేరిన విప్లవ జ్యోతి చేగువేరా అని అన్నారు. సమాజంలో వస్తున్న రుగ్మతలకు వ్యతిరేకంగా యువత రాజకీయాల్లోకి రావాలని, నేటి సమాజంలో మహిళల పట్ల చిన్నచూపు పేద, ధనికైనా తేడా కొనసాగుతూనే ఉందని చెప్పారు. యువత ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తూ ప్రయాణిస్తూ చే వారసత్వని పునికి పుచ్చుకోవాలని, అలా చేసినప్పుడే చే గువేరా వారసులవుతారని, చే ఆదర్శాన్ని కమ్యూనిజపు లక్ష్య సాధనకు అహర్నిశలు కృషి చేయాలనే శపథంతో ముందుకు సాగడమే చేగువేరాకిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మోడియం నాగమణి, సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బుయ్యాన శ్రీను, గిరిజన సంఘం మండల కార్యదర్శి పట్ల లక్ష్మయ్య, సిఐటియు నాయకులు పోచారపు వెంకటేశ్వర్లు, శరత్, తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల శాఖలో వసూళ్ల దందా..!

- రేషన్ దుకాణం నుంచి నెలకు రూ.500 మామూళ్లు
- ఏలూరు జిల్లావ్యాప్తంగా 1,123 రేషన్ దుకాణాలు
- నెలకు రూ.ఐదు లక్షలకుపైగా వసూళ్లని ఆరోపణలు
- రేషన్ బియ్యం రీసైక్లింగ్ అంశాన్ని తెరపైకి తెచ్చి బెదిరిస్తున్నట్లు సమాచారం
- జిల్లా కేంద్రం నుంచే ఈ దందా సాగుతున్నట్లు చర్చ


ప్రజాశక్తి - ఏలూరు

పౌర సరఫరాల శాఖలో వసూళ్ల దందా పెద్దఎత్తున సాగుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. జిల్లా కార్యాలయం నుంచే ఈ దందా సాగుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ దుకాణదారులు, ఆ శాఖలో పని చేసే దిగువస్థాయి అధికారులే లక్ష్యంగా మామూళ్ల వసూళ్లు సాగుతున్నట్లు పెద్దఎత్తున చర్చ సాగుతోంది. రేషన్ బియ్యం రీసైక్లింగ్ వ్యవహారాన్ని ఆయుధంగా చేసుకుని వసూళ్ల పర్వం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఏలూరు జిల్లావ్యాప్తంగా 1,123 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 6.14 లక్షల వరకూ రేషన్‌కార్డులు ఉన్నాయి. రేషన్ బియ్యం రీసైక్లింగ్ అంశాన్ని అడ్డుపెట్టుకుని వసూళ్ల దందాకు పాల్పడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రతి రేషన్ దుకాణం నుంచి నెలకు రూ.500 ఇవ్వాలని హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆ విధంగా నెలకు రూ.ఐదు లక్షలకుపైగా దండుకుంటున్నట్లు అంచనా. అంతేకాకుండా మండలాల్లో పని చేసే ఆ శాఖాధికారులను సైతం నెలవారీగా మామూళ్లు ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు సమాచారం. 'నేను చెప్పినట్లుగా సొమ్ము వసూలు చేసి పంపిస్తే సరేసరి.. లేనిపక్షంలో మీరే ఇబ్బంది పడతారని, ఒకవేళ సొమ్ము ఇచ్చేందుకు ఎవరైనా డీలర్ ఎదురుతిరిగితే ఆ రేషన్ దుకాణంలో తనిఖీలు చేపట్టి కేసు నమోదు చేసి దారికి తీసుకురండి' అని చెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేసేవారిని తన వద్దకు పంపించాలని, లేకపోతే ఇబ్బందులు పడతారని మండలస్థాయి అధికారులను హెచ్చరిస్తున్నట్లు చర్చ నడుస్తోంది. తన మాట వినని అధికారులను వేరే ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై పంపిస్తామని బెదిరించడం, జిల్లా కేంద్రానికి పిలిచి వేధిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పని చేయడం కష్టమని కొంతమంది అధికారులు సెలవులోకి వెళ్లిపోతున్నారని తెలుస్తోంది. పౌరసరఫరాలశాఖ జిల్లా కార్యాలయం నుంచే ఇదంతా జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వెనుక ఉన్న అధికారులు ఎవరో జిల్లా ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి తేల్చాల్సి ఉంది. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తేనే వాస్తవాలు బయటికి వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేటి నుంచి బోధనేతర పనులు బహిష్కరణ

జిల్లా ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు, మిత్ర సంఘాల సభ్యులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

అక్టోబర్ ఏడో తేదీన విజయవాడ పోరుబాట కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల పదో తేదీ నుంచి బోధనేతర, విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయ పరిపాలణాధికారికి, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ ఎడి-1 అవధానికి జిల్లా ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు, మిత్ర సంఘాల సభ్యులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ జి.మోహన్, సెక్రటరీ జనరల్ ఎం.ఆదినారాయణ మాట్లాడుతూ గత 15 నెలలుగా అనేకసార్లు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, ఉపాధ్యాయులకు బకాయి ఉన్న డిఎలు చెల్లించాలని, 12వ పిఆర్‌సి కమిటీ వేయాలని, ఈ లోపు మధ్యంతర అభివృద్ధి ప్రకటించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినప్పటికీ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని, ఈ నేపథ్యంలో దశల వారి ఆందోళనకు రాష్ట్ర ఫ్యాప్టో పిలుపునిచ్చిందని తెలిపారు. పిలుపులో భాగంగా ఈ నెల పదో తేదీ నుంచి బోధనేతర పనులు నిలుపుదల చేస్తున్నామని, అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం అవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో కో ఛైర్మన్ గుడిమెల్లి వెంకటేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ ఆర్.రవికుమార్, రెడ్డిదొర, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

నేవీ ఆయుధ డిపో ఏర్పాటు తగదు

సిపిఐ నేత అక్కినేని వనజ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రజల ఆమోదం లేకుండా, పీసా కమిటీలు, గ్రామసభ తీర్మానం లేకుండా ఏజెన్సీ ప్రాంతంలో నేవీ ఆయుధ డిపో నిర్మాణం చేపట్టడం తగదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. గురువారం జీలుగుమిల్లి మండలంలోని వంకవారిగూడెం పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని మడకంవారిగూడెం, కొత్త చీమలవారిగూడెం, దాట్లవారిగూడెం, రమణక్కపేట గ్రామాల్లో గిరిజనుల సాగులో ఉన్న సారవంతమైన సుమారు 1160 ఎకరాల భూమిని గిరిజనుల అనుమతి లేకుండా నేవీ ఆయుధ డిపోకు బలవంతంగా సేకరించాలని చూడటం సరైనది కాదన్నారు. జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ గిరిజనుల సాగు భూములు కాకుండా వేరే ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఆయుధ డిపో ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం ధారయ్య, నేతలు కంచర్ల గురవయ్య, ఎమ్‌డి.మున్నీర్, బాడిస రాము తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ రుణాలను త్వరితగతిన చెల్లించాలి

ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ముక్కంటి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



మాట్లాడుతున్న ముక్కంటి

ఎస్‌సి కార్పొరేషన్‌లో తీసుకున్న రుణాల బకాయిలను త్వరితగతిన చెల్లించాలని ఎస్‌సి కార్పొరేషన్ ఇడి, జంగారెడ్డిగూడెం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ ముక్కంటి లబ్ధిదారులను ఆదేశించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకొని బకాయిలు చెల్లించని మండలంలోని ఆరుగురు లబ్ధిదారులను పిలిచి మాట్లాడారు. ఈ సందర్భంగా ముక్కంటి మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా వివిధ యూనిట్లలో తీసుకున్న రుణాలను త్వరితగతిన చెల్లించాలన్నారు. లేనిపక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని తహశీల్దార్ ఉదయ్‌భాస్కర్‌ను ఆదేశించారు. గ్రామాల్లో రీసర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

డిసెంబర్‌లో హేలాపురి బాలోత్సవం

బ్రోచర్ ఆవిష్కరించిన డిఇఒ వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డిఇఒ వెంకటలక్ష్మమ్మ

ఏలూరులోని వివిధ సంస్థలకు చెందిన అనేకమంది పెద్దలు, పిల్లల మానసిక వికాసం కోసం హేలాపురి బాలోత్సవం పేరుతో ఆరేళ్లుగా చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. గురువారం ఏలూరు డిఇఒ కార్యాలయంలో బాలోత్సవం ఆహ్వాన సంఘం కమిటీ సభ్యుల సమక్షంలో హేలాపురి బాలోత్సవం పిల్లల సంబరాల కార్యక్రమం బ్రోచర్‌ను డిఇఒ ఆవిష్కరించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు, కె.శ్రీనివాసరావు, ఎ.మోహిని, మేతర అజయ్‌బాబు, పి.ఆంజనేయులు, పివిజి.సత్య వాణి, ఉత్తమదుర్గ, ఎస్‌విఎస్.సోమయాజులు, పి.కస్తూరిబాయి, డాక్టర్ పెరియార్, పి.రవీంద్రనాథ్, జి.రాంబాబు, పి.కనకదుర్గ, వై.నిర్మల, తదితరులు పాల్గొన్నారు. డిఇఒ మాట్లాడుతూ పిల్లల అభివృద్ధి కోసం బాలోత్సవం సంబరాలు ఒక మంచి వేదికగా ఉందన్నారు. విద్యాశాఖ తరఫున తమ వంతు ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఆహ్వాన సంఘ అధ్యక్షులు అలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం హేలాపురి బాలోత్సవం మానవతా మాతృదేవోభవ ట్రస్ట్, అనేక స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు, పిల్లల ప్రేమికులు బాలోత్సవం విజయవంతం కావడంలో భాగస్వాములవుతున్నారన్నారు. పిల్లల సంబరాలు డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో వట్లూరులోని సిద్ధర్థ క్రెస్ట్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. రిటైర్డ్ ఎంఇఒ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ నవంబర్ తొమ్మిదో తేదీన చిన్న పిల్లల అంశాలు, చిత్రలేఖనం విభాగాల్లో ప్రతిభా ప్రదర్శన, డిసెంబర్ 12, 13 తేదీల్లో అకాడమిక్, కల్చరల్ 50 అంశాల్లో ఏలూరు పరిసరాల్లోని ఎనిమిది మండలాలకు సంబంధించిన 250 స్కూల్స్ విద్యార్థులు పాల్గొనడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ ఎయిడెడ్ స్కూల్స్ విద్యార్థులు పాల్గొనేలా అనుమతిస్తూ విద్యాశాఖ నుంచి సర్క్యులర్ విడుదల చేయాలని కోరారు. ఆహ్వాన సంఘం నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ బాలోత్సవం జయప్రదానికి తమ వంతు సహకారం, భాగస్వామ్యం అందించాలని విజ్ఞప్తి చేశారు.

వ్యకాస జిల్లా 32వ మహాసభ జయప్రదానికి పిలుపు


ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఈ నెల 27, 28 తేదీల్లో టి.నరసాపురంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 32వ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంపద సృష్టికర్తలైన వ్యవసాయ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 32వ మహాసభ టి.నరసాపురం మండలంలో జరుగుతుందని, ఈ మహాసభకు వ్యవసాయ కార్మికులు, దాతలు పెద్ద ఎత్తున విరాళాలు అందించి జయప్రదం చేయాలని తోడ్పాటు ఇవ్వాలని పేర్కొన్నారు.

టి.నరసాపురం : వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 32వ మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో మండలంలో కార్యకర్తలు గురువారం ఇంటింటికీ తిరిగి మహాసభ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో మండల కేంద్రంలో మొదటిసారిగా జరుగుతున్న జిల్లా మహాసభ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు దాతలు విరాళాలు అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి బొడ్డపాటి రాజు, బుద్ధుల గంగాభవాని, బుద్ధుల దుర్గమ్మ, ఇందిర, పార్వతి, కుందా చెల్లమ్మ, పైదా రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

లో గ్రేడ్ వర్జీనియా పొగాకు కిలో ధర రూ.300 ఇవ్వాలి

- పత్తి, మొక్కజొన్న, బొబ్బర రైతులను ఆదుకోవాలి
- రైతుసంఘం మండల మహాసభలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్



సంఘీభావం తెలుపుతున్న రైతు సంఘం నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

లో గ్రేడ్ వర్జీనియా పొగాకు కిలోకు రూ.300 ధర కల్పించాలని, పత్తి, మొక్కజొన్న, వరి, బొబ్బర, జీడిమామిడి రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో రైతుసంఘం మండల మహాసభ వెట్టి వీరయ్య అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని పలు రైతాంగ సమస్యలను చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ లో గ్రేడ్ పొగాకు కిలోకు రూ.100లోపు ధర ఇవ్వడం వల్ల పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వర్జీనియా పొగాకుకు మంచి ధర వచ్చిందని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటుందని, కంపెనీలు లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులు పెడుతుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లో గ్రేడ్ పొగాకు కిలోకు రూ.300 ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పత్తిపై 11 శాతం దిగుమతి సుంకాన్ని ఎత్తివేయడం దారుణమని విమర్శించారు. పత్తిపై దిగుమతి సుంకాన్ని కొనసాగించి, క్వింటాల్ పత్తికి కనీస మద్దతు ధర రూ.10 వేలు ప్రకటించాలన్నారు. విత్తన మొక్కజొన్న రైతులను ఆదుకునే విధంగా సమగ్ర విత్తన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. బొబ్బరకు కనీస ధర ఇవ్వడం లేదని, వ్యాపారులు మోసగిస్తున్నారని, బొబ్బరకు కనీస ధర కల్పించాలని కోరారు. మండలంలో ఉన్న చెరువులను బాగు చేయాలన్నారు. పోగొండ, అలివేరు, కొవ్వాడ రిజర్వాయర్ల పరిధి పెంచి మండలంలో అత్యధిక ఆయకట్టుకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోర్స జలపాలు, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నాశనం చేసి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమని విమర్శించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు తీసుకురావాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

ఎపి రైతు సంఘం మండల అధ్యక్షులుగా వెట్టి వీరయ్య, కార్యదర్శిగా కోర్స జలపాలు, ఉపాధ్యక్షులుగా నల్లజర్ల ఆనంద్, సహాయ కార్యదర్శిగా చీమల రాజు, మరో 9 మంది సభ్యులుగా నూతన కమిటీ ఎన్నికైంది.

అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి

బధిరులు తమ అభిప్రాయాలను సంకేతాల రూపంలో వ్యక్తపర్చడం లక్ష్యంగా అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్ తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వేదికగా జిల్లాస్థాయిలో అంతర్జాతీయ బధిరుల వారోత్సవం కార్యక్రమాన్ని గురువారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. తొలుత సామాజిక కార్యకర్త, భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గతంలో పని చేసిన ఫార్మాసిస్ట్ మహీధర్ ఏర్పాటు చేసిన మదర్ థెరిస్సా విగ్రహానికి, సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీతతో కలిసి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భీమడోలు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిసిహెచ్ఎస్ మాట్లాడుతూ ఈ వారోత్సవాల్లో వైద్యులు పాఠశాలలను సందర్శించి వినికిడి లోపం వల్ల ఇబ్బంది పడే బాలలను గుర్తించి వారికి ప్రత్యేక చికిత్స అందజేస్తారన్నారు. అవసరమైన వినికిడి పరికరాల మంజూరుకు సిఫార్సు చేస్తారని తెలిపారు. వినికిడి లోపంతో పుట్టిన పిల్లలను అప్పుడే గుర్తించి తగు చికిత్స అందజేసే సౌలభ్యం, పరికరాలను ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. అనంతరం కొందరు బాలలకు వినికిడి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ఆనంద్ పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటిలో 'ప్రజ్ఞ' తొలిసంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు ప్రజ్ఞ పేరుతో మాసపత్రికను ప్రారంభించింది. ప్రజ్ఞ మాసపత్రిక తొలి సంచికను ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజ్ఞ మాసపత్రికగా ప్రతి నెలా నూజివీడు ఆర్‌జియుకెటి విద్యార్థుల చైతన్యాన్ని, ప్రతిభను, నూతన ఆవిష్కరణలను ప్రచురించనుందని చెప్పారు. అనేక అంశాల సమాహారంగా, విద్యార్థుల ప్రతిభకు పెద్దపీట వేస్తూనే అధ్యాపకులకు సంబంధించిన విద్యాసంబంధిత అంశాలను కూడా ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఐఐటీల్లో ఇలాంటి మాసపత్రికలు ప్రచురితమవుతాయని, అలాంటి సంప్రదాయాన్ని ఐఐఐటీలో కూడా పరిచయం చేయడం సంతోషకరమని చెప్పారు. ఇంజినీరింగ్ విద్యార్థులే తమ పరిజ్ఞానంతో ఈ మాసపత్రిక అంకురార్పణ చేసుకోవడం ఆనందదాయకమన్నారు. ఈ ప్రాజెక్ట్ మెంటార్స్ డిప్యూటీ డాక్టర్ రాజేష్, డాక్టర్ దుర్గాభవాని ఆధ్వర్యంలో ఇంగ్లీష్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ దివ్యశ్రీ మారేపల్లి నిర్వహణ బాధ్యతలు చూశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ డీన్ శ్రావణి, ఐఐటీ డీన్ శ్యాం, పాలనాధికారి డాక్టర్ లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డాక్టర్ సాధు చిరంజీవి, ఫైనాన్స్ అధికారులు డాక్టర్ నాగార్జునదేవి, డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ పావని, మైథిలి, డిప్యూటీలు డాక్టర్ రాజేష్, డాక్టర్ దుర్గాభవాని, వివిధ శాఖ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



తొలి సంచికను ఆవిష్కరిస్తున్న అమరేంద్రకుమార్

దళితులను దగా చేసిన జగన్

చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దళితులను దగాచేసిన చరిత్ర మాజీ సిఎం జగన్ సొంతమంటూ చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ విమర్శించారు. చిత్తూరు జిల్లా దేవళంపేట మండలం దేవరపల్లెలో అంబేద్కర్ విగ్రహానికి సైతం నిప్పుపెట్టిన సంస్కృతి సైతం వైసిపి నాయకులదేనన్నారు. ఏలూరులో దళితనేతలు గురువారం నిరసన తెలిపారు. తొలుత ఈ కార్యక్రమానికి ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి సంఘీభావం తెలిపారు. స్థానిక పవర్‌పేటలో ఉన్న ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీగా పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్, రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ వైసిపి హయాంలో దళితులను అవమానించి అణచివేయాలనుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉన్నమట్ల సునీత, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు జుంజు మోసెస్, కార్పొరేటర్ తంగిరాల అరుణ, తంగిరాల సురేష్, సన్నీ, కో-ఆప్షన్ సభ్యులు జాలా బాలాజీ, మాజీ వైస్ ఎంపిపి లంకపల్లి మాణిక్యాలరావు, ఏలూరు నగర ఎస్‌సి సెల్ అధ్యక్షులు పెద్దాడ రమణ, కార్యదర్శి మెల్లిపాక వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అనుమానంతో భార్యను కడతేర్చిన భర్త

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అనుమానంతో భార్యను భర్త కడ తేర్చిన ఘటన ఏలూరు నగరంలోని మూడో పట్టణ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. చింతలపూడి మండలం సీతానగరం ప్రాంతానికి చెందిన కంతాటి నరేష్‌కు, నాగలక్ష్మి (32)కి 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు గత మూడేళ్ల నుంచి ఏలూరు నగరంలోని శనివారపుపేట హై స్కూల్ సమీపంలో అద్దెకు ఉంటున్నారు. ప్రస్తుతం నరేష్ తాపీ పనులు చేస్తూ ఉండగా నాగలక్ష్మి కొంతకాలం క్రీ పాయింట్లను మరికొంత కాలం మిషన్ కుడుతూ సహాయంగా ఉంటుంది. కొంతకాలంగా నరేష్ నాగలక్ష్మిపై అనుమానం పెంచుకున్నాడు. ఆమె ఎవరితోనో మాట్లాడుతుందని అనుమానపడసాగాడు. ఈ క్రమంలోనే ఇంటి వద్ద గురువారం సాయంత్రం నాగలక్ష్మి మిషన్ కుడుతున్న సమయంలో ఒక్కసారిగా కత్తెరతో ఆమెపై దాడి చేశాడు. పలుమార్లు ఆమెను కత్తెరతో అతి కిరాతకంగా పొడిచాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అక్కడ నుంచి పరారయ్యాడు. నాగలక్ష్మిని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఘటనా స్థలానికి చేరుకున్న మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు వివరాలు సేకరించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బొమ్మినంపాడులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం గోరింతోట చెందిన ఒలిగేటి యేసురాజు(35) 20 రోజుల క్రితం మండలంలోని బొమ్మినంపాడు గ్రామానికి చెందిన బోయిన బాలకృష్ణ రొయ్యల చెరువు మీద పనిచేసేందుకు వచ్చి అక్కడే మఖంలో ఉంటున్నాడు. ఉదయం ఎనిమిది గంటల సమయంలో కరెంటు మోటార్‌తో నీళ్ల తోడుతూ ఉండగా ఆగిపోవడంతో మోటార్‌ను బయటకు తీసి నోస్ ప్లేయర్‌తో వైర్లను కత్తిరిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే చనిపోయాడు. మృతునికి వరసకు కుమారుడైన దాసరి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వివిఎస్.వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మిస్టరీగా వృద్ధురాలి గల్లంతు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని పోల్‌రాజు కెనాల్‌లో గల్లంతైనట్లుగా భావిస్తున్న వృద్ధురాలి అదృశ్యం మిస్టరీగా మారింది. వృద్ధురాలు వీరంకి విమల(65) భర్త సాంబశివరావు మూడు నెలల క్రితం మరణించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన విమల ఇంట్లో నుంచి కొన్నిసార్లు ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు వెతికి ఇంటికి తీసుకొచ్చారు. విమల వైఖరితో భయపడిన కుటుంబ సభ్యులు ఆమెను జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారు. అయినప్పటికీ ఈనెల మూడో తేదీ శుక్రవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే గమనించలేదు. కొంతసేపటికి విమల అదృశ్యాన్ని గుర్తించి వెతకడం ప్రారంభించారు. విమల ఇంటికి సమీపంలో ఉన్న పోల్‌రాజు కాలవలో స్నానానికంటూ దిగి నీటి ఒరవడికి గల్లంతు కాగా కాపాడే ప్రయత్నం చేయలేకపోయినట్లు అక్కడ బట్టలు ఉతికేందుకు వచ్చిన మహిళ ప్రత్యక్షంగా చూశానని కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా విమల జాడ కోసం కాలువ వెంబడి పోలీసులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో విమల ఆచూకీ కోసం అమలాపురం నుంచి ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాన్ని రంగంలోకి దింపారు. ఈ బృందం సభ్యులు కాలువ ఆసాంతం ఐదు రోజుల పాటు బోటుపై గాలించినప్పటికీ ఆచూకీ దొరకలేదు. దీంతో ఎస్‌డిఆర్‌ఎఫ్ బీందం గాలింపు చర్యలు విరమించి తిరిగి వెళ్లిపోయింది. ఎన్నో ప్రమాద ఘటనల్లో వారి మృతదేహాలను కనుగొని బయటకు తీసిన ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందానికి కేవలం 400 క్యూసెక్కుల నీటి ఒరవడి ఉన్న పోల్‌రాజ్ కాలవలో విమల ఆచూకీ కనుగొనలేకపోవడంపై పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. విమల అసలు కాలువలో దిగి గల్లంతైన మాట వాస్తవమా, కాదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - చింతలపూడి

సారా విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నాలుగు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. మండలంలోని ప్రగడవరంలో దాడి చేయగా కంకిపాడు సతీష్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రెండు లీటర్ల నాటుసారాను, కొనకళ్ల అంజమ్మను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి రెండు లీటర్లు మొత్తం నాలుగు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మండలంలోని పంతంగలగూడెంలో పాత నాటు సారా కేసులో నిందితురాలిగా ఉన్న దేశావతు శ్రావణి అనే మహిళను చింతలపూడి తహశీల్దార్ మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వారి ఎదుట హాజరు పరచగా రూ.పది వేల జరిమాన విధించారు.

ముసునూరు : మండలంలోని లోపూడి గ్రామంలో అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సిహెచ్.అజయ్‌కుమార్‌సింగ్ ఆధ్వర్యంలో ఎస్ఐ బి.రాజేంద్రప్రసాద్ దాడి చేశారు. ఈ దాడిలో మహిళ వద్ద ఒక లీటర నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు.

అభివృద్ధి పథంలో సొసైటీలు

కెడిసిసి బ్యాంక్ చీఫ్ మేనేజర్ తలారి వెంకటరంగప్రసాద్

చిట్ చాట్

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సహకారంతో వ్యవసాయ పరపతి సంఘాలు, ఆయా సంఘాల త్రి సభ్య కమిటీలు ప్రగతి పథంలో దూసుకుపోతున్నాయని కెడిసిసి బ్యాంక్ చీఫ్ మెనేజర్ తలారి వెంకట రంగ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.



తలారి వెంకట రంగ ప్రసాద్

ప్రశ్న : మండలంలోని సొసైటీల కార్యకలపాల గురించి చెప్పండి?

చీఫ్ మేనజర్ : మండలంలోని అన్ని సొసైటీల్లో సభ్యులుగా ఉన్న రైతుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : సొసైటీల ద్వారా రైతులకు అందించే సేవలేమిటి?

చీఫ్ మేనేజర్ : పంట రుణాలు, గొర్రెలు, మేకలు, ఎండ్ల బండి లోన్లతో పాటు ల్యాండ్ డెవలప్‌మెంట్ తదితర రైతులకు అవసరమైన మేరకు రుణాలు ఇస్తున్నాం.

ప్రశ్న: సొసైటీల ద్వారా ఏయే సేవలందిస్తున్నారు?

చీఫ్ మేనేజర్ : సొసైటీల ద్వారా రైతులకు పలు రకాల రుణాలు ఇవ్వడంతో పాటు రసాయనిక ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నాం.

ప్రశ్న : సొసైటీల ద్వారా ఎన్ని రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి?

చీఫ్ మేనేజర్ : మండలంలోని 16 గ్రామాల్లో మొత్తం 13 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వాటి ద్వారా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులచే రైతులకు పలు రకాల సేవలందిస్తున్నాం.

ప్రశ్న : సొసైటీల ద్వారా డిపాజిట్ల సేకరణ ఎలా ఉంది?

చీఫ్ మేనేజర్ : అన్ని సొసైటీల ద్వారా రైతులకు రుణాలు ఇవ్వడంతో పాటు డిపాజిట్ల సేకరణ కూడా జరుగుతుంది. చింతలవల్లి, చెక్కపల్లి గ్రామాల వ్యవసాయ పరపతి సంఘం సొసైటీలు మెరుగైన ప్రగతి సాధిస్తున్నాయి.

ప్రశ్న : ఉన్నతాధికారుల సహకారం ఏ విధంగా ఉంటుంది?

చీఫ్ మేనేజర్ : రైతులకు రుణాలు మంజూరు చేసే సమయంలో ఉన్నతాధికారులు సహకారం అందిస్తున్నారు. ఎల్లప్పుడూ అండగా ఉంటున్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - చింతలపూడి

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని చింతలపూడి ఎంఇఒ-2 సొంగా కిరణ్‌బాబు అన్నారు. పట్టణంలో స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నియోజకవర్గ కన్వీనర్ పి.వేణు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తున్నారు. 9, 10 తేదీల్లో జరిగే ఈ పోటీలకు నూజివీడు ఉపవిద్య శాఖాధికారి డాక్టర్ పిఎస్.సుధాకర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. మండల విద్యాశాఖాధికారి ఎస్.కిరణ్‌కుమార్ వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలిచిన అభ్యర్థులను డివిజన్ స్థాయికి ఎంపిక చేస్తారని కన్వీనర్ వేణు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి కన్వీనర్ సీమోను, రిటైర్డ్ పీడీ గిరిరాజ్, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

హాస్టల్ విద్యార్థులు ఏ చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా వార్డెన్‌కు కాని, వైద్య సిబ్బందికి కాని తెలియజేయాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు స్థానిక అమీనాపేట షెడ్యూల్ కులాల, వెనుకబడిన తరగతుల, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ వైద్య బృందం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్‌సి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ మానస, డాక్టర్ ప్రగతి, డాక్టర్ నవ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు హాస్టల్ వార్డెన్స్ పాల్గొన్నారు.

మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ఏలూరు అర్బన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు గురువారం స్థానిక ఇండోర్ స్టేడియం మైదానంలో శనివారపుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏలూరు మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు శనివారపుపేట జిల్లా పరిషత్ హై స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు పద్మలత తెలిపారు. వచ్చిన విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సదుపాయం కల్పించారు.

బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బాణాసంచా తయారీ, నిల్వ కేంద్రాలపై పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించారు. నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ పర్యవేక్షణలో, నూజివీడు రూరల్ ఇన్‌స్పెక్టర్ కొప్పిశెట్టి రామకృష్ణ, పోలీస్, రెవెన్యూ అగ్నిమాపక సిబ్బందితో కలిసి గురువారం నూజివీడు రూరల్ సర్కిల్ పరిధిలో బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

అమరావతి నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ముదినేపల్లి

అమరావతి నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని శ్రీహరిపురం గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం శ్రీహరిపురం గ్రామ సచివాలయంలో అమరావతికి జీవం పోద్దాం రూ.116 సాయం చేద్దాం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది తమ వంతు విరాళాలను ఎపిసిఆర్‌డిఎ ఖాతాకు క్యూఆర్ కోడ్ ద్వారా పంపించారు. విరాళాలు సిఆర్‌డిఎ ఖాతాకు పంపించిన సచివాలయ ఉద్యోగులందరి పాదాలను డాక్టర్ మనోజ్ కడిగి, వారందరికి శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సిఎంఆర్‌ఎఫ్ : మంత్రి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రాష్ట్రంలో సుమారు 5.50 కోట్ల మంది ప్రజలకు కూటమి ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్య సేవలందిస్తుందని, నూజివీడు నియోజకవర్గంలో 950 మంది లబ్ధిదారులకు సుమారు రూ.ఏడు కోట్లను సిఎం సహాయ నిధి చెక్కులను అందించామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో గురువారం నిర్వహించిన సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. నూజివీడు నియోజకవర్గంలో 68 కుటుంబాలకు సుమారు రూ.36 లక్షల చెక్కులను, ఆగిరిపల్లి మండలంలో పది మంది లబ్ధిదారులకు రూ.4,89,693 చెక్కులను అందించారు. అనంతరం సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్ సందర్భంగా నిర్వహించిన అవగాహరనా ర్యాలీలో పాల్గొని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి గ్రామ సర్పంచి సిహెచ్.లక్ష్మీవిక్టర్‌బాబు, తహాశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్, ఎంపిడిఒ బి.భార్గవి, టిడిపి మండలాధ్యక్షులు ఎన్.వేణు, ప్రధాన కార్యదర్శి కె.సాంబశివరావు, టౌన్ పార్టీ అధ్యక్షులు పి.నరసింహారావు, బిసి సెల్ నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు ఎ.శ్రీనివాసరావు, ఎం.గోపాల్ పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి

ముసునూరు : గ్రామాలాభివృద్ధికి తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ముసునూరులో యాదవ కమ్యూనిటీ హాలుకు రూ.20 లక్షలను మంజూరు చేసిన సందర్భంగా మండల కేంద్రమైన ముసునూరు గ్రామ యాదవ సంఘం నాయకులు, కులస్తులు మంత్రి కొలుసు పార్థసారథిని విజయవాడ పార్టీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. గ్రామంలో సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రిని కలిసినవారిలో తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి కొండేటి బాబి, ఉప సర్పంచి తోట శ్రీను, టిడిపి నాయకులు టి.రంగారావు, గ్రామస్తులు చెను సత్యనారాయణ, ఒరుగు రంగారావు, కోప్పల దుర్గారావు, మానికల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం కాని గ్రామసభలెందుకు?

సర్పంచిని నిలదీసిన మండవల్లి వాసులు

ప్రజాశక్తి - మండవల్లి

సమస్యలు పరిష్కారం కానప్పుడు గ్రామసభలు నిర్వహించి ప్రయోజనం ఏంటని గ్రామస్తులు గ్రామసభలో ప్రశ్నించారు. మండల కేంద్రమైన మండవల్లి గ్రామసభ సర్పంచి మెండ ఝాన్సీ అధ్యక్షతన స్థానిక నాగేంద్ర స్వామి కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డ్రెయినేజీ, విద్యుత్ స్తంభాలు, కుళాయిలు, తాగునీటి సమస్యలపై, కొత్త ఇళ్లకు ఇంటి పన్ను ఎందుకు వసూలు చేయడం లేదని పంచాయతీ సర్పంచిని ప్రశ్నించారు. పంచాయతీ నిధులు, బ్లీచింగ్, పారిశుధ్య కార్మికులకు జీతాలకు ఇతర పనులకు ఖర్చు చేశామని, రూ.40 వేలు మాత్రమే నిల్వ ఉన్నాయని, ఇంటి పన్నులు రూ.11 లక్షలు ఉన్నాయని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు అప్పారావు ప్రశ్నించారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్లే గ్రామ సభకు ప్రజలు హాజరు కావడం లేదన్నారు. గ్రామసభకు అధికారులు హాజరు కాకుండా సమస్యలు పరిష్కారం కాకుండా గ్రామసభ నిర్వహిస్తే ఎవరికి లాభమని ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ నిర్వహిస్తున్న గ్రామ సభకు కార్యదర్శి, సర్పంచి ఆలస్యంగా రావడం గ్రామ సభను లేటుగా నిర్వహించడం అత్యంత బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్, చిట్టిబాబు, సత్తిబాబు, కార్యదర్శి గిరిజ పాల్గొన్నారు.

త్వరలో పేద జంటలకు సామూహిక వివాహాలు

రాట్నాలమ్మ ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో ఎంఎల్ఎ చింతమనేని

ప్రజాశక్తి - పెదవేగి

పెదవేగి మండలం రాట్నాలకుంటలోని శ్రీ రాట్నాలమ్మ ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ మండపంలో నూతన ట్రస్ట్ బోర్డు సభ్యులచే దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ త్వరలో శ్రీరాట్నాలమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో పేద జంటలకు సామూహిక వివాహాలు నిర్వహిస్తామని తెలిపారు. రాట్నాలకుంట వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్య కొంత ఇబ్బందికరంగా మారిందని, పరిష్కారానికి చర్యలు తీసుకుం టామని చెప్పారు. ఆలయం వద్ద రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేకమైన భారీకేడ్ల విధానాన్ని కూడా అమలు చేస్తామని, అతి తక్కువ ధరలకే షెడ్లను భక్తులకు అందిస్తామని చెప్పారు. ఆలయ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమ ఏర్పాటుకు సైతం స్థలం మంజూరు చేయడానికి తాను పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని,



ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎంఎల్ఎ చింతమనేని

వృద్ధాశ్రమ నిర్మాణానికి సైతం తన చింతమనేని ఛారిటబుల్ ట్రస్ట్ నుంచి కూడా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రూ.16 లక్షలు వెచ్చించి అమ్మవారికి వెండి తాపడం చేయించిన దెందులూరు మండలం సోమవరపాడు గ్రామస్తులు అన్నే శివకృష్ణను ఎంఎల్ఎ ప్రత్యేకంగా అభినం దించారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఎఎంసి ఛైర్మన్ గారపాటి రామసీత, బిజెపి జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, నామినేటెడ్ పదవుల గ్రహీతలు, ప్రజా ప్రతినిధులు, సహకార సొసైటీల ఛైర్మన్లు, పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి

ప్రజాశక్తి - పోలవరం



ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసిపి పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించి రాష్ట్రాన్ని అప్పుల కుప్పలుగా మార్చి వేశారని, కూటమి అధికారం లోకొచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం మహిళా సంక్షే మం దిశగా దీపం-2 పథకం ద్వారా మూడు గ్యాస్ సిలిండర్లు అంది స్తుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. డిఎస్‌సి నిర్వ హించి అపాయిం ట్‌మెంట్లు కూడా ఇచ్చినట్లు తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు, క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

పిహెచ్‌సిల్లో సూపర్ జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి - పోలవరం

అత్యవసర పరిస్థితుల్లో రోగికి ఇచ్చే మందులపై కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి తగ్గించిందని ఐటిడిఎ పిఒ రాములునాయక్ తెలిపారు. పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్యశాలలో జిఎస్‌టి ధరల తగ్గింపుపై ఆసుపత్రి కరస్పాంటెండెంట్ పి.రాంబాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయన వార్డుల్లో రోగులను పరామర్శించి, వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాసుపత్రిలో కళ్ల డాక్టర్, స్త్రీల ప్రసూతి డాక్టర్లను నియమించాలని ప్రజలు కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబు, పోలవరం మెడికల్ షాప్స్ యూనియన్ ప్రెసిడెంట్, మండవల్లి సుబ్బారావు, సింహాద్రి ప్రసాద్, లక్ష్మణరావు, అప్పారావు, గుప్తా, గ్రామపంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మండలంలోని దిగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ చెన్నా రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ రాయితీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామ ప్రజల అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయికృష్ణ, సిహెచ్ఒ ఝాన్సీరాణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మెడికల్ షాపుల్లో జిఎస్‌టి తగ్గింపు ధరలకు మందులు అమ్మాలని మండల



నూజివీడులో అవగాహనా ర్యాలీ

అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీనివాస్ మెడికల్ షాపుల సిబ్బందికి ఆదేశించారు. స్థానిక పిహెచ్‌సిలో మందుల ధరలు తగ్గడంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి దివ్య, ఫార్మసిస్ట్ నాగేశ్వరావు, సిహెచ్ఒ శ్రీనివాస్, రాము, జగన్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : స్థానిక ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ నాగేశ్వరరావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. చింతలపూడి రూరల్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. చింతలపూడి మెడికల్ రూరల్ అసోసియేషన్ అధ్యక్షులు వజ్రపు శేఖర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు కొండ్రు దేవా, గుమ్మిశెట్టి భారతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిఎస్‌టి ఒ ఆర్ శ్రీనివాస్, ఎఇఒ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు :ప్రతి వస్తువుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్‌టి తగ్గించడంతో అందరికి వెసులుబాటు కలిగిందని సర్పంచి కొండేటి విజయలక్ష్మి అన్నారు. ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్ జిఎస్‌టి- సూపర్ సేవింగ్స్ కార్యక్రమం వైద్యులు గంగాధరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పిల్లి ఏసుబాబు, మండల కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వంశీకృష్ణ, ఆరోగ్య కేంద్రం సిబ్బంది కుమారి, మురళీమోహన్, మెడికల్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

భీమడోలు : సూపర్ జిఎస్‌టి ప్రజల జీవితం, ఆరోగ్యం కోసం సూపర్ ఆదా చేసుకునే అవకాశాన్ని కల్పిస్తుందని జిల్లా వైద్య సేవల సమన్వయకర్త డాక్టర్ పాల్ సతీష్ కుమార్ అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిఎస్‌టి 2.0పై సూపర్ జిఎస్‌టి సూపర్ ఆదా కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సతీష్‌కుమార్‌తో పాటు అతిథిగా భీమడోలు సిహెచ్‌సి పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత హాజరయ్యారు. జిఎస్‌టి వైద్య ఆరోగ్య విభాగం జిల్లా నోడల్ అధికారి ఎం.మహీధర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సి పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత, ఎఎంసి ఛైర్‌పర్సన్ గిరి, కనీస వేతనాల సంఘం డైరెక్టర్ పుల్లయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి పిహెచ్‌సిలో నిర్వహించిన అవగాహనా సదస్సులో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్ పి భవాని, ఫార్మసిస్ట్ జాన్ బాబు, ఎఎన్ఎంలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు అనంతపురంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఐద్వా మండల కార్యదర్శి నేలటూరి నిర్మల పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని భగత్ సింగ్ కాలనీ బ్యాంక్ ఆఫ్ బరోడా రోడ్డులో జెండా ఆవిష్కరించి మహాసభ విజయవంతం ముగ్గులు వేసి నినాదాలు చేశారు. భగత్ సింగ్ కాలనీలో బి.సీత జండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు వెంకటలక్ష్మి, సునీత, మణి, నగీన, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో రతన్ టాటా వర్ధంతి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు చక్రధరరావు అధ్యక్షతన టాటా గ్రూపు అధినేత రతన్ టాటా ప్రథమ వర్ధంతి సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రధరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు, కె.సుజాత పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయించొద్దు

ప్రజాశక్తి - మండవల్లి

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామచంద్రరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాణసంచా విక్రయదారులకు తగు సూచనలను, సలహాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా మందు గుండు సామగ్రిని కలిగి ఉండడం, నిల్వ ఉంచడం చట్టరీత్యా నేరమన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా విక్రయదారులు అనుమతులు పొంది అధికారులు నిర్దేశించిన ప్రాంతంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆధార్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని వెలగపాడు పంచాయతీ వీరభద్రవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శాశ్వత ఆధార్ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మల్లుకుంట సొసైటీ ఛైర్ పర్సన్ శీలం సాయి వినయ్, సొసైటీ కార్యదర్శి కెవివి.సత్యనారాయణ, వెలగపాడు సర్పంచి నైనారపు జలపాలు, టిడిపి వెలగపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు జోనుబోయిన భాషా, తదితరులు పాల్గొన్నారు.

సీజ్డ్ వాహనాలకు 22న వేలం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం పరిధిలో రవాణా శాఖ ద్వారా నిర్బంధించిన రవాణా, రవాణేతర వాహనాలకు ఈ నెల 22వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. చాల కాలంగా పన్ను చెల్లించకుండా, ఫిట్‌నెస్ లేకుండా, ఇతర క్రమరాహిత్యాలను కలిగి రహదారులపై తిరుగుతున్న రవాణా, రవాణేతర వాహనాలను విధి నిర్వహణలో భాగంగా వాహన తనిఖీ అధికారులు నిర్బంధించినట్లు తెలిపారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన అపరాధ రుసుం, వాహనాన్ని నిర్బంధించిన వరకు ఉన్న పన్ను బకాయిలను చెల్లించి వాహనాన్ని తీసుకెళ్లాలని వాహన యజమానికి, ఫైనాన్సర్‌కు నోటీసు, డిమాండ్ నోటీసులు జారీ చేసినప్పటికీ వారినుంచి ఇప్పటివరకు స్పందన లేదని, వేలం ద్వారా వచ్చిన సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. మూడు గూడ్స్ క్యారియర్లు, ఒక మ్యాక్సి క్యాబ్, మూడు ట్రాక్టర్లు, తొమ్మిది మోటార్ సైకిల్స్‌కు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి డిపోలో ఈ నెల 22వ తేదీ వేలం నిర్వహిస్తామని తెలిపారు.

పామాయిల్ కాటా ప్రారంభం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆయిల్ పామ్ రైతుల సౌకర్యం కోసం నూతన కాటా ఏర్పాటు చేసినట్లు నవ భారత్ కంపెనీ డిజిఎం రాజ గోపాల్ తెలిపారు. మండలంలోని మర్రిగూడెం గ్రామంలో నవ భారత్ కంపెనీ ఆధ్వర్యంలో రూ.కోటి వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన పామాయిల్ కాటాను గురువారం జంగారెడ్డిగూడెం నవభారత్ ఆయిల్ పామ్ జోన్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆచంట సూర్యనారాయణ ప్రారంభించారు. పామాయిల్ కాటా ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఏరియా నవ భారత్ ఆయిల్ పామ్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు, మక్కినవారిగూడెం సొసైటీ ఛైర్మన్ ఆచంట సూర్యనారాయణ, గెడా శ్రీధర్, ఆలపాటి పాపారావు, పిన్నమనేని రాము, పొట్టా రామారావు, పూనెం ఆదిత్య, బలుసు వేణు, కాకర్ల మోహన్, కొయ్యమూడి పార్థ పాల్గొన్నారు.

పిఎం జీవనజ్యోతి బీమా సొమ్ము అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం ఎస్‌బిఐ బ్యాంకులో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం ద్వారా సహజ మరణానికి మంజూరైన రూ.రెండు లక్షల బీమా సొమ్మును స్థానిక ఎస్‌బిఐ టౌన్ బ్రాంచ్ మేనేజర్ పిఆర్.సతీష్‌కుమార్ లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ పాడిశెట్టి పద్మజ శ్రీనివాస్ ఎస్‌బిఐ సేవింగ్స్ అకౌంట్ ద్వారా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం నిమిత్తం ఏడాదికి రూ.436 చెల్లించారన్నారు. ఖాతాదారుడు ఆకస్మిక మరణంతో అతని భార్య పాడిశెట్టి ఉమాకు రూ.రెండు లక్షల బీమా సొమ్మును గురువారం అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కోటేశ్వరరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.